# మనిషి కథ

## శంకరం వెళ్లిపోయాడు.

ధర్మారావుకు ఇల్లంతా ఏదో వెలితిగా వుంది. మనసు మనసులో లేదు.

వరమ్మ సుశీల - భావిదగ్గర బట్టలు ఉతికే కార్యక్రమం మొదలెట్టారు. తోమిన గిన్నెల్ని తొలిచి పక్కన పెడుతోంది శాంతమ్మ. రామం, ప్రభ, చంద్ర - గేటు పక్కన వున్న సీమచింత చెట్టు మీద తమ ప్రతాపం చూపిస్తున్నారు.

ధర్మారావు కాలుగాలిన పిల్లిలా తిరగసాగేడు. వరండాలో నుంచీ కాంపౌండు గేటుదాకా వచ్చి, మళ్ళీ వెనక్కి వెళ్తూ పచార్లు చేస్తున్నాడు. చేతులు రెండూ వెనక్కి కట్టుకొని నడుస్తున్నవాడల్లా ఆగి - వుండుండి ఓసారి వాటిని గాలిలో ఆడిస్తూ, అంతలోనే చప్పట్లు చరిచి, పెదవి విరచి - మళ్ళా పచార్లు ప్రారంభిస్తున్నాడు.

ఇంటివాళ్ళ పోర్షన్‌లో పిడుగులు రాలుస్తున్నాడు, కామేశంగారు. ఆయనే ఆ యింటికి యజమాని. "నువ్వెన్నైనా చెప్పు నా బొందిలో ప్రాణం వుండగా అది నా గుమ్మం తొక్కడానికి

వీల్లేదు. ఇది అక్కడికి పోవడానికి వీల్లేదు. ఈవిడిక్కడ ఏడ్చినా మొత్తుకున్నా, నేనేమి కరిగిపోను. బోడిముండకి దానికే అంత పట్టుదల వుంటే - ఇక్కడెవరూ గాజులు తొడుక్కొని కూర్చో లేదు. ఈ సంగతి నీ కోడలికి అర్థమయ్యేటట్టు చెప్పు "

కామేశంగారు తన కొడుక్కి చెల్లెలి కూతుర్నే చేసుకున్నారు. ఆమె భర్త పోయి చాలాకాలమైంది. అన్నాచెల్లెళ్ళ మధ్య మాటపట్టింపులూ, పంతాలు రెచ్చిపోయి రాకపోకలు బందయిపోయినై. అయినా, కోడలు పుట్టింటి ఆశను చంపుకో లేక - పండక్కో, పబ్బానికో పుట్టింటికి పోవాలనే ప్రసక్తి తెస్తూ వుంటుంది. కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది. అత్తగారి మనస్సు మెత్తబడుతుంది. భర్తతో ఆ విషయం కదిలిస్తుంది. ఆయనేమో ఇదీ వరస.

ఇదంతా ధర్మారావుకు తెలిసిన భాగవతమే.

ఇంట్లోవాళ్ళంతా ఎవరి కార్యక్రమంలో వాళ్ళు నిమగ్నులై వున్నారు. అయినా ధర్మారావుకు ఏదో వెలితిగా వుంది, ఎంత వద్దనుకున్నా శంకరం మాటలు తలపుకు వస్తున్నాయి.

బస్సుస్టాండులో,

కొడుక్కి కొంచెం ఎక్కువగానే హితబోధ చేశాడు ధర్మారావు. " అదృష్టం కొద్దీ నీకీ ఉద్యోగం దొరికింది. సంపాదిస్తున్నాను కదా అనుకొని అనవసరపు ఖర్చు చెయ్యకు. ఇంటి పరిస్థితి నీకు తెలియనిదికాదు. రెండో తారీఖు వచ్చిందంటే పది పన్నెండు కళ్ళు తపాలా బంట్రోతుకోసం ఆశగా ఎదురు

చూస్తుంటాయి యిక్కడ. ఆఫీసులో కూడా జాగ్రత్తగా మసలుకో. ఎక్కడో ఆలోచిస్తున్నట్లు అలా పరధ్యానంగా వుండకు. రోజులు బాగా లేవు. ”

తండ్రి ముఖంలోకి అదోలా చూసి అన్నాడు, శంకరం –
“ అట్టాగేలెండి. జీతం రాగానే డబ్బు పంపుతాను. సరేనా. మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా ”

శంకరం స్వరంలో ధ్వనించిన తీవ్రతకి అవాక్కయి పోయాడు ధర్మారావు. ఆయన ఏదో చెప్పబోయాడు,కానీ, బస్ స్టార్టయింది.

ధర్మారావు శంకరం కేసి చేయి వూపేడు. శంకరం అప్పటికప్పుడే మొహాన్ని అటువైపుగా తిప్పేసుకున్నాడు.

బస్ ముందుకు వెళ్ళిపోయింది.

శంకరం హైదరాబాద్ వెళ్ళిపోయాడు.

టెలిగ్రాఫ్ స్తంభంలా నిలబడిపోయాడు ధర్మారావు.

శంకరం అని వెళ్ళిన మాటలతో ఆయన హృదయం బరువుగా వుంది. ఆ మాటల్లోని తీవ్రతతో ఆయన మనస్సు గీ పెడుతోంది. ఆ తీవ్రతలో – ఈసడింపు, చిరాకు, నిర్లక్ష్యం, విసుగు, అన్నీ ధ్వనించాయి ఆయనకు.

ధర్మారావు నాలుక తడుపుకొని గుటకలు మింగేశాడు.

‘ జీతం రాగానే డబ్బు పంపుతాను, సరేనా. మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా ? ’

ధర్మారావు కళ్ళల్లో నీరు తిరిగింది.

ఏభై నాలుగేళ్ళ జీవితంలో – ఎన్నెన్నో సందర్భాలల్లో ధర్మారావు కళ్ళు చెమ్మగిలినై. తల్లీ తండ్రీ పోయి, తన వాళ్ళన్న వాళ్ళు కరువై వారాలు చేసుకుని చదువుకొనే రోజుల్లో – ఆకలి తీవ్రతని అనుభవింపజేసిన రాత్రులు – ఆయన కళ్ళవెంట నీరు చూసి చిరునవ్వు నవ్వుకునేవి! తెలుగు భాషని నమ్ముకొని అభిమానంగా సాహిత్యం చదివే రోజుల్లో - సాటివారి అవహేళనకూ ఆయన కళ్ళు చెమర్చేవి. ఉద్యోగం కోసం బెజవాడ నుంచీ వైజాగ్ దాకా – స్టేషన్లు మారుతూ పోయి తిరిగి తిరిగి బెజవాడ చేరుకుని ఈ కంపెనీలో గుమాస్తాగా చేరిన రోజుల్లో – కనుకొలుకుల్లో ముత్యాలు నిలిచేవి. పెళ్ళయి శాంతమ్మతో కాపురం ఆరంభమైన తర్వాత ధర్మారావుకు కళ్ళు చెమర్చడం అలవాటుగా మారింది. అందుకనే, దృష్టి లోపం లేకపోయినా ఈ రోజుల్లోనే కళ్ళజోడు వాడటం మొదలెట్టేడు.

'మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా' –

'నా కంటే నా డబ్బేగదా మీకు ముఖ్యం' అన్నట్టు ప్రశ్నించాడు, శంకరం.

నిజానికి శంకరం కంటే శంకరం డబ్బు ముఖ్యమా తనకు ?

ధర్మారావు కళ్ళముందు ఎన్నో దృశ్యాలు కదలాడినై.

సంక్రాంతి పండుగనాడు —

ఇల్లంతా కోలాహలంగా వుంది. మధ్యాహ్నం పన్నెండు దాటింది. పక్క పోర్షన్‌లోని వాళ్ళంతా తమ వరండాలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. వున్నట్టుండి ఏదో అదృశ్య హస్తం తన వెన్ను చరచినట్లయింది. " శంకరం ఏడీ ? " - ఎవరికి వారు - " ఇక్కడే వుండాలి " " ఇప్పుడే చూశాను " అంటూ సమాధానాలు యిచ్చేరు. అక్కడ లేడు. పెరట్లో, సామాన్ల గదిలో, వీధిలో, బీరువాలల్లో అంతా వెతికేరు. కనిపించ లేదు. చప్పున ఏదో స్ఫురించింది తనకు. దడదడ లాడుతున్న గుండెతో, గబగబా డాబా మీదికి పరుగెత్తేడు తను. వెనగ్గా అంతా వచ్చేరు. తాను చూసిన దృశ్యానికి హృదయం విలవిల్లాడింది. పిట్టగోడ మీద కూర్చొని దాని వారగా వున్న బాదంచెట్టు కొమ్మల్ని అందుకోజూస్తున్నాడు శంకరం. శిధిలావస్థలో వున్న మొండిగోడ అది. అట్టే ఎత్తు లేదు. ఒక్క ఉదుటున వాణ్ణి చేతుల్లోకి తీసుకొన్నాడు. ఈ సంఘటన తలుపుకొస్తేనే చాలు - మనసంతా భయంతో వూగిపోయేది. " తాను వెళ్ళడం క్షణం ఆలశ్యమైతే ఏమైవుండేది " అనే వూహే తన వెన్ను జలదరింపచేసేది. శంకరంకు అప్పుడు మూడో ఏడు !

వాడికి ఐదోఏట —

ఊరంతా వ్యాపించిన మశూచి తన యింటినీ పలకరించింది. శ ం క ర ం మంచమెక్కాడు. శరీరమంతా ముత్యాలు. కళ్ళల్లో వత్తులు వేసుకొని కాగుతున్న పాలని చూస్తున్నట్టు చూస్తూ కూర్చునేవాడు తాను - ఇరవై ఒక్కరోజులు.

అలాంటి శంకరం —

" మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా " అని తేలిగ్గా అనేసి వెళ్ళిపోయాడు.

" ఎంతసేపలా పచార్లు చేస్తూ వుంటారు, బజారుదాకా వెళ్లి నాలుగు కూరలు తెండి మళ్లీ ఆఫీస్ టైమయిందంటూ ముళ్ల మీద కూర్చుంటారు "

శాంతమ్మ మాటలకు ఈ లోకంలో పడ్డాడు ధర్మారావు. చేతి సంచీ అందించిందామె. ఆయన బయటికి వడిచాడు.

దారిలో పరంధామయ్య కలిసేడు. " మీ వాడికి ఉద్యోగ మొచ్చిందటగా ? " అడిగేడు.

" అవును ఇవ్వాళే వెళ్ళాడు "

" అదృష్టవంతుడివి. కొడుకు చేతికి అందొచ్చాడు. ఇక నీ పని పైలాపచ్చీసు పంచకల్యాణీ " అని " పార్టీ ఎప్పుడు మరి ? " అంటూ ప్రశ్నించాడు.

ధర్మారావు పేలవంగా నవ్వాడు. పార్టీ మాటకు సమాధానం రాకపోవడంతో నిరుత్సాహం కలిగింది పరంధామయ్యకు. " వస్తా " అంటూ వెళ్ళిపోయాడు. పరంధామయ్య ఎంప్లాయీస్ యూనియన్ ప్రెశిడెంటు.

నాలుగడుగులు వేసేసరికి అహమ్మద్ తగిలేడు. అతనూ ధర్మారావు సహోద్యోగే.

" మీ వాడికి ఉద్యోగం వచ్చిందటగా మీ జీతంను ఇక నించీ కొంచెం సరదాగా ఖర్చెట్టుకోవచ్చు "

దానికి ధర్మారావు పేలవమైన నవ్వే జవాబైంది.

కొంచెంసేపు ఆఫీసు కబుర్లు చెప్పి వెళ్లిపోయాడు - అహమ్మద్.

దూరల మార్కెట్‌లో గుర్నాధం కలిసేడు. ఆయన శాంతమ్మకు దూరపు చుట్టం, అన్న వరస, పల్లెలో బాగా హోతుబరిగా పేరు బడ్డాడు. శాంతమ్మకు పుట్టింటి నుంచి వచ్చిన ఎకరం భూమి సంగతీ గుర్నాధమే చూస్తూవుంటాడు.

ఏడాదికో మూడు వందలో నాలుగువందలో తోచింది ఇచ్చి పోతూ వుంటాడు. కొన్నేళ్ళు పంటలు లేవని ఏమీ రాదు. ఆ పొలం మీద వచ్చే ఫలసాయం కంటే - దానికి చెల్లించాల్సిన శిస్తులు, సెస్సులు ఎక్కువగా వుంటాయనే చిరాకు వుంది - ధర్మారావుకు. "డ్రైనేజి సెస్సు చెల్లించాలట డెబ్భైరూపాయలు నాలుగయిదు రోజుల్లో ఏర్పాటు చేయండి బావగారూ" అన్నాడు. ధర్మారావుకు ఏం సమాధానం చెప్పాలో తెలీలేదు.

క్షణాల తర్వాత గుర్నాధం అన్నాడు "శంకరాయ్‌కి ఉద్యోగం వచ్చిందటగా, వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా వుంటుందిలే వాడి సంపాదన పర్వాలేదు."

ధర్మారావుకి గుర్నాధం మాటలు వినిపించడం లేదు. డెభ్భై అంకె కళ్ళముందు కనబడుతోంది.

తనకేదో కోర్టులో పనుందంటూ వెళ్లిపోయాడు గుర్నాధం.

ధర్మారావు ముందుకు కదిలేడు.

పదిగంటలకు ఆఫీసుకు చేరేడు ధర్మారావు. సహోద్యోగు లంతా ధర్మారావుని అభినందించసాగేరు. చివరకు అందరిదీ ఒకే అభిప్రాయం, కోరిక - "పార్టీ కావాలి"!

ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉరుము ఉరిమింది. కేబిన్‌లో నిప్పులు కురుస్తున్నారు డైరెక్టరుగారు. క్షణంలో అందరికీ అవగతమైంది. సుబ్రమణ్యంలోపల వున్నాడు. అతనికి పదాలు గొంతులో ఇరుక్కుపోయి వుంటాయని అనుకోసాగేరు - కేబిన్ బయట వున్నవాళ్లంతా, "మన కంపెనీ నూకలు చెల్లినై ఆయనకి" - అన్నాడు అహమ్మద్.

వాతావరణంలో ఓ ఫిరంగి మ్రోగింది. ప్యూన్ వచ్చి హడావిడిగా చెప్పేడు, "మిమ్మల్ని బాస్ పిలుస్తున్నారు."

ధర్మారావు లోపలికి వెళ్లాడు. "ధర్మారావుగారూ కంపెనీ సొమ్ము నాలుగువేలు తాను "మిస్ అప్రాప్రియేట్" చేసినట్టు నేరం ఒప్పుకుంటూ ఈయన వ్రాసి ఇచ్చిన లెటర్ ఇది. డిస్మిసల్ ఆర్డర్ తయారు చేయించండి" అన్నారు ఇద్దరికేసి చూస్తూ. ఇద్దరూ బయటికి వచ్చేశారు.

ఆ తర్వాత యూనియన్‌వారి రాయబారం సుబ్రమణ్యం క్షమాపణకై వేడికోలు వగైరా - అన్నీ చకచకా సాగిపోయినై. డైరక్టర్ మాత్రం తన నిర్ణయాన్ని సడలించుకోలేదు. ఋజువైన నేరాన్ని గురించి ఎవరు ఎన్ని చెప్పినా వినవని ఖండితంగా చెప్పేశాడు.

సుబ్రమణ్యం డిస్మిస్ అయ్యాడు. తన చేతిమీదుగా ఆర్డర్ని "సర్వ్" చేయాల్సి వచ్చినందుకు బాధ పడ్డాడు ధర్మారావు. ఆ రాత్రి ధర్మారావుకు కంటినిండా నిద్ర కరువైంది.

రెండో తారీఖు వచ్చింది! తపాలా బంట్రోతు కోసం ఎదురు చూసిన కళ్ళకి నిరాశా చీకటే ఎదురైంది

పదిహేడో తారీఖున తండ్రికి జాబు వ్రాసేడు, శంకరం. "ఇక్కడ నేను క్షేమం, అక్కడ అంతా క్షేమమనుకుంటాను. ఇంతేసంగతులు, చిత్తగించవలెను" - ఇదీ సారాంశం!

శాంతమ్మ కళ్ళు తుడుచుకుంది, ధర్మారావేమో తన మామూలు నవ్వు నవ్వుకున్నాడు, దీర్ఘంగా నిట్టూర్పు విడిచేడు.- "నువ్వేమీ డబ్బు పంపనందుకు అమ్మానాన్న బాధపడ్తూన్నా" రంటూ అన్నకి వుత్తరం రాసింది సుశీల.

బెదురు బెదురుగా, భయం భయంగా, అనుమానం అనుమానంగా మరో నెల గడిచింది. మళ్లీ వచ్చిన రెండో తారీఖూ ధర్మారావును పలకరించకుండానే వెళ్ళిపోయింది.

వరమ్మ రాసిన కవరుకు జవాబుగా పదిహేను రోజుల తర్వాత శంకరం రాసిన కార్డు వచ్చింది. "పదిమందిలో తిరిగేవాణ్ణి. నేను గుడ్డలు కుట్టించుకోవడానికే చాల్లేదు జీతం" అంటూ. శంకరం జీతం అంకె - ఆరువందల మీద ఆరు వేల కూడికలు, తీసివేతలూ, ఇతర లెక్కలు చేయబడినై!

ధర్మారావు కళ్లలో ఆశల వలయాలు గిరికీలు కొట్టి కొట్టి ఒకదానిలో ఒకటి అలుక్కుపోయి రూపరహితాలైపోయాయి.

" మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా " అన్న శంకరం మాటలు చెవుల్లో మార్మోగినై.

అనావృష్టి మరో ఎనిమిది నెలలు సాగింది. ఈ నడుమ - అమ్మకు అనారోగ్యమంటూ వరమ్మ రాసిన జాబు కూడా శంకరం నుంచీ మౌనాన్నే మోసుకొచ్చింది.

వరమ్మకి పెళ్ళిచూపులు జరిగినై.

ఆ రాత్రి - ధర్మారావు భార్యని అడిగేడు - " ఇంటివాళ్ళ కోడలు కనిపించదేం ఇందాకా ? " అని.

" ఆ యమ్మాయ్ పుట్టింటికి వెళ్ళిందండీ నిన్న. మళ్ళీ నీళ్ళు పోసుకుంది, నాలుగో నెల " అన్న సమాధానం విని నడుం వాల్చిన వాడల్లా తక్కున లేచి మంచం మీద కూర్చున్నాడు. " అవునండీ, కామేశంగారే వెళ్ళిరమ్మన్నారట. " అంటూ నిష్క్రమించింది శాంతమ్మ.

ధర్మారావు ఏదో స్వప్నంలోకి జారిపోయాడు.

నాల్గు రోజుల తర్వాత - ఓ రోజు ఆఫీసులో —

డైరెక్టర్‌గారు ధర్మారావుని కేబిన్‌లోకి పిల్చేరు. అప్పటికే అక్కడో కుర్రాడు నిలబడి వున్నాడు. " చూడండి ధర్మారావుగారూ ఈ అబ్బాయి పేరు చంద్రశేఖరం. మన కంపెనీలో అపెండరుగా తీసుకొంటున్నాం. మిగిలిన పనులన్నీ చూడండి. ఇవ్వాళే ఇతను జాయిన్ అవుతున్నాడు " - అని చెప్పి మేనేజర్‌తో మాట్లాడటం మొదలెట్టేడు. ఆ తర్వాత తెలిసిందేమిటంటే -

చంద్రశేఖరం సుబ్రమణ్యం తమ్ముడని ! మాటల ప్రసక్తిలో చెప్పేడు పరంధామయ్య, సుబ్రమణ్యం కుటుంబం వీధులపాలు కాకుండా కాపాడాడు మన డైరెక్టర్, " ఇటీజ్ వెరీ కైండాఫ్ హిమ్ " అంటూ.

ధర్మారావు స్వప్నంలోని కాంతిరేఖలు ఇంకా ఇంకా ముందుకు పయనించసాగేయి.

" పిల్ల నచ్చింది. పదివేలు కట్నం యిచ్చేటట్టయితే ముహూర్తాలు పెట్టుకుందాం " ... అంటూ అందిన వార్త ధర్మారావు నెత్తిన ఓ గుయ్యారాన్ని పడేసింది. " సంబంధం మంచిది పిల్లవాడు బ్యాంకులో మంచి వుద్యోగంలో వున్నాడు - ఎలాగైనా ఈ సంబంధం ఖాయం చేసుకుందాం " అంటూ శాంతమ్మ - భర్త చెవుల్లో ఇల్లు కట్టుకుంది. ధర్మారావుకేమో - కనీసం కావలసిన పదివేలు - అంకెను తలచుకుంటే - గుండెలు జారిపోతున్నై.

వ్యూహాలు, పథకాలు, ప్రణాళికలూ రచించటం సాగిపోయింది. తనవల్ల కాదని తేల్చేసుకొన్నాడు ధర్మారావు. ఆలాగని కబురు వెళ్ళింది - అవతలి వాళ్ళకి. ఈ వివరాల కవరు కూడా శంకరం నించీ పల్లెత్తు మాటను తీసుకరాలేదు. ఇంట్లో అంతా పళ్లు కొరుక్కొని గుప్పిట బిగపట్టుకున్నారు. " ఇంత కర్కోటకుడిలా తయారౌతాడనుకోలేదు " - అనుకుంది శాంతమ్మ.

పదిహేను రోజుల తర్వాత —

బ్యాంకులో మంచి ఉద్యోగంలో వున్న అబ్బాయే ధర్మారావు యింటికి సకుటుంబంగా వచ్చాడు - పెళ్ళికి ముహూర్తాలు పెట్టించండంటూ.

ధర్మారావుకి ప్రపంచములోని మంచితనమూ, అదృష్టమూ అంతా తన ముందే గుమ్మరించినట్లయ్యింది. మనస్సు కృతజ్ఞతతో తడిసి ముద్దయిపోయింది. కళ్ళు సజలాలైనాయి !

మరో కొద్ది సేపటికే —

దేవాలయ ద్వారాలు తెరుచుకున్నాయి. ఎటు చూసినా కాంతి పట్టకాలు కదలాడుతున్నాయి, వాటి వెలుగు కిరణాల్లో ఒకటి ధర్మారావు కళ్లను చురుక్కుమని తాకింది. ఆ కిరణం— శంకరం !

తన బొందిలో ప్రాణముండగా కోడల్ని పుట్టింటికి పంపనే పంపను అన్న కామేశంగారు; సుబ్రమణ్యంను డిస్మిస్ చేసి చంద్రశేఖరంకి ఉద్యోగమిచ్చిన డైరెక్టరూ; పదినెలలు నిరాశనే పంచిపెట్టి ఇప్పుడొక బాధ్యతను మోస్తున్న శంకరమూ - అంతా అనంత కళల్ని సృష్టిస్తున్న కళాకారులుగా కనిపిస్తున్నారు - ధర్మారావుకి.

కట్నం డబ్బు చేతికందిన పెళ్ళివారు ధర్మారావుపట్ల అభిమానం, ఆప్యాయత, అన్నిటినీ మించిన అణకువ - చాలా ఎక్కువగానే చూపాలని తాపత్రయపడుతున్నారు.

వీరూ ఆ కళాకారుల బృందంలో సభ్యులు !

" మరి నువ్వో ? " — ఎవరో ప్రశ్నించినట్లయి వులిక్కిపడ్డాడు ధర్మారావు. నిద్ర నించి తేరుకున్నట్లయింది. " మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా " అన్న శంకరం మాటలు గుర్తుకొచ్చినై.

వేదాంతిలా నవ్వుకోబోయి, ప్రతినాయకుడి నవ్వు నవ్వేశాడు. ధర్మారావు !!!

$0_0 0$